సాక్షి
రాజన్న సిరిసిల్ల
శుక్రవారం । 9 । ఫిబ్రవరి । 2024

వైభవంగా మహాలింగార్చన

వేములవాడ: దక్షిణకాశీగా విరాజిల్లుతున్న వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో గురువారం రాత్రి మహాలింగార్చన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. మాస శివరాత్రి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో అర్చకులు లింగార్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.




ఫ్లాష్‌మాబ్



సిరిసిల్లక్రైం: రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించేందుకు గురువారం సిరిసిల్ల నేతన్న చౌక్ వద్ద పలువురు విద్యార్థులు ఫ్లాష్‌మాబ్ చేపట్టారు. నృత్య రూపాల్లో రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఎస్పీ అఖిల్‌మహాజన్ మాట్లాడుతూ రోడ్డు నిబంధనలు పాటించి క్షేమంగా ప్రయాణించాలన్నారు. మద్యం తాగి వాహనం నడపవద్దని, అధిక వేగంతో వెళ్లవద్దని సూచించారు. ఏఎస్పీ చంద్రయ్య, సీఐ రఘుపతి, ట్రాఫిక్ ఎస్సై రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతర



కోనరావుపేట(వేములవాడ): మాఘ అమావాస్య జాతరకు జిల్లాలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. జిల్లా వ్యాప్తంగా మానేరుతీరంతోపాటు కోనరావుపేట మండలం మామిడిపల్లిలో శుక్రవారం జాతర ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు సిరిసిల్ల జిల్లా కేంద్రం శివారులోని మానేరువాగులో మూడు ఆలయాలతోపాటు మామిడిపల్లిలోని సీతారామచంద్ర స్వామి, నాగారంలోని కోదండ రామస్వామి, ధర్మారంలోని వేంకటేశ్వర ఆలయాలను సిద్ధం చేశారు. ఇప్పటికే ఏర్పాట్లు సైతం పూర్తయ్యాయి.

టార్గెట్

సిరిసిల్లక్రైం: ఆధునిక పరిజ్ఞానం గల అన్ని రకాల ఆయుధాలపై పోలీసులకు అవగాహన ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని సర్దాపూర్‌లో ఉన్న బెటాలియన్‌లో గురువారం పోలీస్ అధికారులు, సిబ్బందికి ఫైరింగ్‌పై శిక్షణ ఇచ్చారు. ట్రెయినీ ఎస్పీ రాహుల్‌రెడ్డి, డీఎస్పీలు ఉదయ్‌రెడ్డి, నాగేంద్రచారి, రవి కుమార్, సీఐలు రఘుపతి, సదన్ కుమార్, శశిధర్‌రెడ్డి, కరుణాకర్, కిరణ్ కుమార్, ఆర్‌ఐలు యాదగిరి, మధుకర్, రమేశ్ పాల్గొన్నారు.



న్యూస్‌రీల్

క్రీడలు పోటీతత్వాన్ని పెంపొందిస్తాయి



సిరిసిల్లటౌన్: క్రీడలు పోటీతత్వాన్ని పెంపొందిస్తాయని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో గురువారం జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ.. గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహిస్తున్నారన్నారు. జిల్లా క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈనెల 16వ తేదీ నుంచి సూర్యాపేటలో జరిగే రాష్ట్ర పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్ గెంట్యాల శ్రీనివాస్, కబడ్డీ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు బొడ్డు రాములు, తిరుపతి, ముస్తాఫా, పీఈటీలు, తదితరులు పాల్గొన్నారు.

15న సెలవు ప్రకటించాలి



సిరిసిల్లటౌన్: సేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని ఈనెల 15న రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించాలని లంబాడీల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు నరేశ్‌నాయక్ కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. సేవాలాల్ జయంతి సందర్భంగా జిల్లాకు రూ.73వేలు కేటాయించడం సరికాదన్నారు. నియోజకవర్గానికి రూ.లక్ష చొప్పున నిధులు మంజూరు చేయాలని కోరారు. మోహన్, రమేశ్, రాజేశ్, గంగాధర్, నవీన్ నాయక్ పాల్గొన్నారు.

'డబుల్' కాలనీలో వసతులు కల్పించాలి



సిరిసిల్లటౌన్: డబుల్ బెడ్‌రూమ్ కాలనీల్లో వసతులు కల్పించాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మూశం రమేశ్ కోరారు. ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ సమీపంలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లను గురువారం పరిశీలించి, స్థానికులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో పూర్తి కానీ ఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేయాలని కోరారు. పదేళ్లుగా ఎదురుచూసిన లబ్ధిదారులు విసిగిపోయి మూడు రోజుల క్రితం డబుల్ ఇళ్లలోకి ప్రవేశించారని, వారిని ఖాళీ చేయించేందుకు అధికారులు బెదిరింపులకు పాల్పడడం సరికాదన్నారు. కరెంటు సరఫరా నిలిపివేయడం అమానుషమన్నారు. ఎరవెల్లి నాగరాజు, గన్నేరం నర్సయ్య, రాములు, అనిల్, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న టెన్త్ ఇంటర్నల్ మార్కుల తనిఖీ



సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థులకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు కేటాయించిన ఇంటర్నల్‌మార్కులను ప్రభుత్వ ఉపాధ్యాయులు తనిఖీ చేస్తున్నారు. జిల్లా విద్యాధికారి రమేశ్ ఆదేశాలతో పరిశీలన కొనసాగుతోంది. చేతిరాత బుక్కులను ప్రాజెక్టు వర్క్, క్లాస్‌వర్క్, ప్రవర్తన విధానాన్ని పరిశీలిస్తున్నట్లు గెజిటెడ్ హెచ్‌ఎం మోతిలాల్ బృందం తెలిపింది.

రోగులకు 'పరీక్షే'

- రక్తపరీక్షలకు వాక్యుటేనర్స్ కొరత
- జిల్లాలోని సీహెచ్‌సీలలో మందకొడిగా రక్తపరీక్షలు
- వారం రోజులుగా తిరుగుతున్న వైద్యసేవలు కరువు
- వ్యాధి నిర్ధారణ కాక అందని మందులు
- ఇబ్బంది పడుతున్న రోగులు



ఈమె ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన ఊసి లక్ష్మి. కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతోంది. పలుసార్లు ఆస్పత్రుల్లో చూపించుకున్నప్పటికీ జబ్బు నయం కాలేదు. వైద్యులు రక్తపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రక్త పరీక్షలు చేయించుకునేందుకు వారం రోజులుగా సీహెచ్‌సీకి వస్తూ.. పోతోంది. వాక్యుటేనర్స్ కొరతతో పరీక్ష చేయడం లేదు. ఇది లక్ష్మి పరిస్థితే కాదు.. రాజన్నసిరిసిల్ల జిల్లాలోని అన్ని సీహెచ్‌సీలలో రోగులు పడుతున్న ఇబ్బంది.



ల్యాబ్‌లో వాక్యుటేనర్స్ లేక నిలిచిన రక్త పరీక్షలు



ఎల్లారెడ్డిపేట ఆరోగ్య కేంద్రం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రుల్లో రక్తపరీక్షలు చేయడం నిజంగా రోగులకు పరీక్షగానే మారింది. ఎల్లారెడ్డిపేట సీహెచ్‌సీకి నిత్యం వందకు పైగా రోగులు వస్తుండగా.. రక్తం సేకరించే ట్యూబ్‌లు(వాక్యుటేనర్స్) యాభై వరకే అందుబాటులో ఉండడం ఇబ్బందిగా మారుతుంది. ఒక్కో రోగి వారంపాటు సీహెచ్‌సీ చుట్టూ తిరుగుతున్నా శాంపిల్స్ తీసుకోవడం లేదు. ఫలితంగా వ్యాధి నిర్ధారణ కాక మందులు అందక ఇబ్బంది పడుతున్నారు. ఈ పరిస్థితి రాజన్నసిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఉన్న సీహెచ్‌సీలలో ఉంది.

వాక్యుటేనర్స్ కొరతతో ఇబ్బంది

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో నిత్యం 100 నుంచి 150 మంది వరకు రోగులు వస్తుంటారు. వారికి రోగ నిర్ధారణ చేయడానికి రక్త నమూనాలు సేకరించే ట్యూబ్‌లు(వాక్యుటేనర్స్) అవసరం. ల్యావెండర్, గ్రేట్యూబ్స్ రోజుకు 100 అవసరం ఉంటే.. 50 మాత్రమే సరఫరా అవుతున్నాయి. ఫలితంగా ప్రతి శనివారం, మంగళవారం చికిత్సల కోసం వచ్చే గర్భిణులు సైతం ఇబ్బందులు పడుతున్నారు.

నిలుస్తున్న పరీక్షలు

రక్తనమూనాలు సేకరించే ట్యూబ్‌ల కొరతతో రోగులకు చేసే రక్తపరీక్షలు నిలిచిపోతున్నాయి. గత నెలలో ట్యూబ్‌లు లేకపోవడంతో 15 రోజులపాటు రక్త పరీక్షలు చేయలేదు. దీంతో చేసేదేమి లేక పలువురు రోగులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారు. దీనికితోడు ఇంతకుముందు టీహబ్ మిషన్ పనిచేయక 15 రోజులపాటు సీహెచ్‌సీలో రక్తపరీక్షలు నిలిచిపోవడంతో సిరిసిల్లకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాల్సిన పరిస్థితి. షుగర్ వ్యాధిగ్రస్తులు ఇబ్బంది పడుతున్నారు.

గర్భిణులకు తప్పని తిప్పలు

ప్రతీ శని, మంగళవారాలలో మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల నుంచి గర్భిణులు వివిధ వైద్య సేవల కోసం మండల కేంద్రంలోని ఆస్పత్రికి వస్తుంటారు. వారికి సరైన సమయంలో చేయాల్సిన రక్తపరీక్షలకు ట్యూబ్‌ల కొరత ఉండడంతో కొన్ని పరీక్షలు చేయడం లేదు. ఇలా పరీక్షలు చేయకుండానే మందులు ఇవ్వడం ద్వారా పలువురు గర్భిణులు ఇతరత్ర సమస్యలతో ఇబ్బంది పడ్డట్లు తెలిసింది.

ప్రొసీడింగ్స్ వచ్చాయి

రక్తపరీక్షల కోసం ఉపయోగించే వాక్యుటేనర్స్ సరఫరాకు ప్రొసీడింగ్స్ వచ్చాయి. ల్యావెండర్, గ్రేట్యూబ్‌ల కొరత ఉంది. ప్రభుత్వం నుంచి సరఫరా అయ్యే వరకు ప్రైవేట్‌గా కొనుగోలు చేసి సీహెచ్‌సీకి అందిస్తున్నాం. రెండు రోజుల్లో 200 ట్యూబ్‌లు సమకూర్చాం. ప్రొసీడింగ్స్ రావడంతో త్వరలోనే ఈ సమస్య పరిష్కారమవుతుంది.

– రాంప్రసాద్, టీహబ్ ప్రతినిధి, సిరిసిల్ల

దొంగ కనెక్షన్లు ఏరిపారేస్తాం

- బకాయిల్లేకుంటేనే గృహజ్యోతి
- సిబ్బంది నయమపాలన పాటించాలి
- సెస్ చైర్మన్ చిక్కాల రామారావు
- ఆఫీసులో గురువారం ఆకస్మిక తనిఖీ



సెస్ ఆఫీస్‌లో ఆకస్మికంగా తనిఖీ చేస్తున్న చైర్మన్ చిక్కాల రామారావు

సిరిసిల్లటౌన్: సెస్ పరిధిలోని అనుమతి లేని విద్యుత్ కనెక్షన్లు ఏరిపారేస్తామని ఇందుకు సిబ్బంది పారదర్శకంగా పనిచేయాలని సంస్థ చైర్మన్ చిక్కాల రామారావు హెచ్చరించారు. సెస్ బకాయిలు పెరుగుదల.. కలెక్షన్లు తరుగుదల, సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం, తదితర అంశాలపై గురువారం ఆకస్మిక తనిఖీ చేపట్టిన సందర్భంగా ప్రస్తావించారు. అన్ని సెక్షన్లలో తిరిగి అధికారులతో మాట్లాడారు. అనంతరం రామారావు మీడియాతో మాట్లాడుతూ.. ఏడు దశాబ్దాలుగా సహకార రంగంలో దేశంలోనే ఆదర్శంగా ఉంటున్న సిరిసిల్ల సెస్(సహకార విద్యుత్ సరఫరా సంఘం)లో బకాయిలు పేరుకుపోవడం సరికాదన్నారు. సమయానికి విధులకు రాని ఉద్యోగులను హెచ్చరించారు. సెస్ పరిధిలోని అనుమతిలేకుండా ఉంటున్న విద్యుత్ కనెక్షన్లను రెగ్యులరైజ్ చేసుకోవాలని లేకుంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బకాయిల్లేకుంటేనే..గృహజ్యోతి

ఇప్పటి వరకు సంస్థకు ఎలాంటి విద్యుత్ బకాయిల్లేని వారికే ప్రభుత్వం ఇస్తామన్న గృహజ్యోతి పథకం వర్తింపజేస్తామని స్పష్టం చేశారు. ఈవిషయాన్ని క్షేత్రస్థాయిలో ప్రచారం చేసి విద్యుత్ బకాయిలు వసూలు చేయాలని సిబ్బందికి సూచించారు. రూ.865కోట్లు బకాయిలు చెల్లించాలని ఎన్‌పీడీసీఎల్ సీఎండీ నుంచి లేఖ వచ్చిందని తెలిపారు. ఇకపై వారంలో మూడు రోజులు కార్యాలయంలోనే అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన సబ్సిడీ, అన్ని ప్రభుత్వ ఆఫీసుల బకాయిలపై దృష్టి సారించినట్లు వెల్లడించారు. అవినీతికి పాల్పడే సిబ్బందిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

చిన్నారి కిడ్నాప్ యత్నంపై పోలీసుల ఆరా

- స్కూల్ యాజమాన్యం నుంచి వివరాల సేకరణ
- పాఠశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి : సిరిసిల్లటౌన్ సీఐ రఘుపతి

సిరిసిల్లక్రైం: సిరిసిల్లలోని ఓ పాఠశాలలో ఎనిమిదేళ్ల చిన్నారికి చాక్లెట్ ఆశ చూపి ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించినట్లు 'సాక్షి'లో గురువారం ప్రచురితమైన కథనానికి జిల్లా పోలీసులు స్పందించారు. సంబంధిత విద్యాలయ నిర్వాహకులతో మాట్లాడినట్లు తెలిసింది. దీనిపై స్పెషల్, ఐడీ పార్టీ పోలీసులు ఉదయమే ఆరా తీయగా చాక్లెట్ ఆశచూపిన మాట వాస్తవమని, కానీ విద్యార్థిని తీసుకెళ్లడానికి సంబంధిత పాఠశాల నుంచి ఎక్కడ సులభమార్గాలు లేవని విద్యాసంస్థ నిర్వాహకులు తెలిపినట్లు సమాచారం.

విచారణ చేపట్టిన సీఐ

చిన్నారి కిడ్నాప్ యత్నంపై సిరిసిల్ల టౌన్ సీఐ రఘుపతి పాఠశాలకు వెళ్లి పరిశీలించారు. సంఘటనపై స్కూల్ యాజమాన్యంతో మాట్లాడి ఆరా తీశారు. విద్యార్థి చేతిపై గీతలు ఉన్నాయని, లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. స్కూల్ ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని మేనేజ్‌మెంట్‌కు సూచించారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా పట్టణంలోని పాఠశాలల్లో విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఇస్తామని తెలిపారు.

నిబంధనలు పాటిస్తూ ఈవీఎంల తనిఖీలు

- కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: ఎన్నికల సంఘం ఆదేశాలతో నిబంధనలు పాటిస్తూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)ల మొదటి స్థాయి తనిఖీ చేపడుతున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. సర్దాపూర్ అగ్రికల్చర్ మార్కెట్ కమిటీయార్డ్(ఏఎంసీ)లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)ల మొదటిస్థాయి తనిఖీలను కలెక్టర్ గురువారం పరిశీలించారు. అదనపు కలెక్టర్ ఎస్.ఖీమ్యానాయక్ పర్యవేక్షణలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల మొదటి స్థాయి తనిఖీ కొనసాగుతోంది.

జిల్లా ఓటర్లు 4,70,597

- వేములవాడలో 2,25,376
- సిరిసిల్లలో 2,45,221
- తుది ఓటర్ల జాబితా విడుదల చేసిన కలెక్టర్



సిరిసిల్ల: జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల తుది ఓటర్ల జాబితాను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి గురువారం ప్రకటించారు. జిల్లాలోని 4,70,597 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. వేములవాడలో 2,25,376 ఓటర్లు, సిరిసిల్ల నియోజకవర్గంలో 2,45,221 ఓటర్లు ఉన్నారు.

మహిళా ఓటర్లే అధికం

సిరిసిల్ల, వేములవాడ రెండు నియోజక వర్గాల్లోనూ మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గాల్లో 16,552 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. జిల్లా తుది ఓటర్ల జాబితాను వెల్లడించిన కలెక్టర్ అనురాగ్ జయంతి ఇంకా ఎవరైనా 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఉంటే వెంటనే ఓటర్లుగా నమోదు చేసుకోవాలని కోరారు.

జిల్లా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	సర్వీసు ఓటర్లు	మొత్తం
వేములవాడ	1,07,783	1,17,508	32	53	2,25,376
సిరిసిల్ల	1,19,140	1,25,967	08	106	2,45,221
మొత్తం	2,26,923	2,43,475	40	159	4,70,597

చిన్నతరహా పరిశ్రమలను ప్రోత్సహించాలి



జిల్లా రుణ ప్రణాళికను విడుదల చేస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

- పరిశ్రమల స్థాపనకు రుణాలివ్వాలి
- వ్యవసాయ రుణాలను మరింత పెంచాలి
- సోలార్ యూనిట్ల స్థాపనను ప్రోత్సహించాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి
- జిల్లాస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం
- జిల్లా రుణ ప్రణాళిక రూ.3,203.60 కోట్లు

సిరిసిల్ల: చిన్నతరహా పరిశ్రమలకు స్థాపనకు ముందుకొచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు బ్యాంకులు రుణాలిచ్చి ప్రోత్సహించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లా స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకులు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తమకు కేటాయించిన లక్ష్యాలు చేరుకోవాలన్నారు. వ్యవసాయరంగానికి మరింత రుణవసతి కల్పించాలని, సోలార్ విద్యుత్ యూనిట్ల స్థాపనకు ముందుకొచ్చే పవర్‌లూమ్, రైస్‌మిల్లులకు రుణాలు అందించి ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు ఆర్థిక ప్రోత్సాహాన్ని మరింతగా పెంచాలన్నారు. గృహరుణాలు ఇవ్వాలని కలెక్టర్ కోరారు. మహిళా సంఘాలకు రుణాలు విరివిరిగా ఇవ్వాలన్నారు. గ్రామపంచాయతీలు కొనుగోలు చేసిన ట్రాక్టర్ల ఈఎంఐ చెల్లించేలా చూడాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు, స్వయం ఉపాధి రంగాలకు రుణాలివ్వాలని కోరారు. పీఎంఎఫ్‌ఎంఈలో యూనిట్‌లను గ్రౌండింగ్ చేయాలన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలి

ఆర్‌బీఐ ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి మార్చి 6 వరకు గ్రామాల్లో ఆర్థిక అక్షరాస్యత క్యాంపులు నిర్వహించాలని కోరారు. సైబర్ నేరగాళ్లను అదుపు చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మహాశివరాత్రి జాతర సందర్భంగా వేములవాడకు వచ్చే భక్తులకు బ్యాంకింగ్ సేవలపై అవగాహన కల్పించాలని, వీలైతే అకౌంట్ ఓపెనింగ్, ఇతర సేవలు అందించాలని కోరారు. నాబార్డ్ అందించే వివిధ రుణాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. 2024–2025లో జిల్లా రుణప్రణాళికను రూ.3,203.60 కోట్లుగా నిర్ధారిస్తూ బ్యాంకర్లు, అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, ఎల్‌డీఎం మల్లికార్జున్‌రావు, ఆర్బీఐ ఎల్డీవో సాయితేజారెడ్డి, నాబార్డ్ డీడీఎం జయప్రకాశ్, యూబీఐ చీఫ్ మేనేజర్ ప్రేమ్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వినోద్, డీపీవో రవీందర్, డీఏవో భాస్కర్, డీఎఫ్‌వో శివప్రసాద్, డీఆర్డీవో శ్రీనివాస్, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఆయాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఆగంతకుల బెదిరింపులు

- ఆందోళనలో తల్లిదండ్రులు



సంఘటన స్థలంలో విచారిస్తున్న పోలీసులు

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండల కేంద్రంలో గురువారం గుర్తుతెలియని వ్యక్తులు పదో తరగతి విద్యార్థినులను బెదిరింపులకు గురిచేసిన సంఘటన చోటుచేసుకుంది. ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఇంటికి వెళ్లారు. భోజన అనంతరం తిరిగి స్కూల్‌కు వెళ్తుండగా.. సుభాష్ విగ్రహం వద్ద ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో బాలికలు అరవగా.. చుట్టుపక్కల ఉన్న మహిళలు ఆగంతుకులను బెదిరించేందుకు ప్రయత్నించగా.. ముగ్గురు బైక్‌పై పరారయ్యారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు మధ్యాహ్న భోజన సమయ విరామంలో బయటకు వస్తారని.. గుర్తు తెలియని వ్యక్తులు కత్తులుచూపి బెదిరించడంపై వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. సమాచారం తెలుసుకున్న హెడ్‌కానిస్టేబుల్ భూమయ్య సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. సీసీ కెమెరాలోని ఫుటేజీని పరిశీలిస్తున్నామని ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దని కోరారు.

క్లుప్తంగా

కుక్కల దాడిలో మేకలు, కోళ్ల మృతి



చనిపోయిన మేకలు, కోళ్లను పరిశీలిస్తున్న ఎంపీపీ మానస, పశువైద్యాధికారి సంతోష్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): కుక్కలు దాడి చేయడంతో మేకలు, కోళ్లు మృతి చెందిన ఘటన తంగళ్లపల్లి మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన పరకపల్లి తిరుపతి దంపతులు బట్టలకొట్టు పెట్టుకుని జీవిస్తున్నారు. దీంతోపాటు మేకలు, కోళ్లు పెంచుతున్నారు. ఈక్రమంలో గురువారం షెడ్డులో ఉన్న మేకలు, కోళ్లపై కుక్కలు దాడిచేశారు. ఈ దాడిలో 6 మేకలు, 20 కోళ్లు మృత్యువాతపడ్డాయి. ఎంపీపీ పడిగెల మానస, మండల పశువైద్యాధికారి సంతోష్‌కుమార్ పరిశీలించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మండలకేంద్రానికి చెందిన పరకపల్లి తిరుపతికి చెందిన ఆరుమేకలు, ఇరవై కోళ్లు గురువారం కుక్కల దాడిలో మృతిచెందాయి. బాధితులను మాజీ జెడ్పీటీసీ కోడి అంతయ్య పరామర్శించి రూ.5వేలు ఆర్థికసాయంగా అందజేశారు.

బీఆర్‌ఎస్ కౌన్సిలర్లకు విప్ జారీ



కౌన్సిలర్ ఇంటికి నోటీస్ అతికిస్తున్న సిబ్బంది

వేములవాడ: వేములవాడ మున్సిపల్‌లో ఎంపికైన బీఆర్‌ఎస్ కౌన్సిలర్లకు విప్‌జారీ చేశారు. ఈ మేరకు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య గురువారం ప్రకటన విడుదల చేశారు. వేములవాడ మున్సిపల్‌లో వైస్‌చైర్మన్ పదవీ ఖాళీ కావడంతో ఈనెల 12న ఎన్నిక నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ తరఫున గెలుపొందిన కౌన్సిలర్లు హాజరై 4వ వార్డు కౌన్సిలర్ మారం కుమార్‌కు అనుకూలంగా ఓటు వేసి వైస్‌చైర్మన్‌గా ఎన్నుకోవాలని సూచించారు. ఈమేరకు బీఆర్‌ఎస్ కౌన్సిలర్ల ఇంటికి నోటీసులు అతికించారు. వైస్‌చైర్మన్ ఎన్నిక సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ విప్ జారీ చేయడం వేములవాడలో చర్చనీయాంశంగా మారింది.

సమ్మెను విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కోనరావుపేట(వేములవాడ): మధ్యాహ్న భోజన కార్మికుల ఆధ్వర్యంలో ఈనెల 16న చేపట్టే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు జవ్వాజి విమల కోరారు. కోనరావుపేటలో గురువారం సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా చేపడుతున్న సమ్మెకు సహకరించాలని కోరారు. ఈనెల 16న తిప్పాపూర్ బస్టాండ్ నుంచి చెక్కపెల్లి బస్టాండ్ వరకు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. యూనియన్ జిల్లా కార్యదర్శి గురజాల శ్రీధర్, కార్మికులు బాలమణి, కవిత, రాధ, వసంత, బాబాయి, దేవవ్వ పాల్గొన్నారు.

ఈ-కేవైసీ నమోదుకు మరో అవకాశం

- ఈ నెలాఖరు వరకు గడువు పొడిగింపు
- జిల్లాలో ఇప్పటి వరకు 80 శాతం పూర్తి



ఈ-కేవైసీ చేస్తున్న రేషన్ డీలర్ (ఫైల్)

గంభీరావుపేట(సిరిసిల్ల): రేషన్‌కార్డుల ఈ-కేవైసీ ప్రక్రియను ప్రభుత్వం ఈ నెలాఖరు వరకు పొడిగించింది. జిల్లాలో ఈ-కేవైసీ ప్రక్రియ నెమ్మదిగా సాగుతోంది. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 80 శాతం మాత్రమే కేవైసీ పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 343 రేషన్ దుకాణాల్లో 1.73లక్షల రేషన్‌కార్డులు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 5 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారు. ఇప్పటి వరకు 4 లక్షల మంది మాత్రమే రేషన్ దుకాణాల్లో ఈ-కేవైసీ అప్‌డేట్ చేయించుకున్నారు. ఇంకా లక్ష మంది లబ్ధిదారులు కేవైసీ చేయించుకోవాల్సి ఉంది. తొలుత జనవరి 31 కేవైసీ నమోదుకు తుది గడువు విధించారు. చాలా గ్రామాల్లో కేవైసీ పూర్తికాకపోవడంతో ప్రభుత్వం ఈ నెలాఖరు వరకు మరో అవకాశం కల్పించింది.

ఈ-కేవైసీ ఎందుకంటే..

రేషన్ సరుకులు పక్కదారి పట్టకుండా పంపిణీలో పారదర్శకత పాటించేందుకు ప్రభుత్వం రేషన్ ఈ-కేవైసీని చేపట్టింది. రేషన్‌కార్డులో పేరున్న కుటుంబ సభ్యులందరూ తమకు సమీపంలోని రేషన్‌డీలర్ వద్దకు వెళ్లి ఈ-ఐపాస్ యంత్రం ద్వారా వేలిముద్రలు వేసి ఈ-కేవైసీ చేయించుకోవాల్సి ఉంది. రేషన్‌కార్డు నంబర్‌తోపాటు ఆధార్ కార్డు నంబర్‌ను అనుసంధానం చేస్తున్నారు. మృతుల పేర్లు, పెళ్లి చేసుకొని వెళ్లిపోయి వారు, ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన వారి పేర్లను కొన్ని చోట్ల రేషన్‌కార్డులో తొలగించలేదు. బియ్యం కోటాను యథావిధిగా దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. దీన్ని గుర్తించిన ప్రభుత్వం ఈ-కేవైసీ పూర్తి చేసుకున్న వారికే బియ్యం పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటుంది.

ఆధార్ అప్‌డేట్ అవస్థలు

అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం లబ్ధిదారుల నుంచి ఈ-కేవైసీ సేకరిస్తోంది. ఈ నేపథ్యంలో ఆధార్ అప్‌డేట్ అనేది లబ్ధిదారులకు తలనొప్పిగా మారింది. రేషన్ ఈ-కేవైసీ పూర్తి కావాలంటే ఆధార్ అప్‌డేట్ ఉండాలి. లేనివారు ఆధార్ కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. కొందరి వేలిముద్రలు రాకపోవడం, ఐరిష్ తదితర వివరాలు నమోదు కాకపోవడం, ఫోన్ నంబర్ లింక్ కాకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలకు సంబంధించి ఈ సమస్యలు ఎదురవుతున్నాయి. బతుకుదెరువు కోసం, ఉద్యోగరీత్యా విదేశాల్లో, పట్టణాల్లో ఉంటున్న వారి ఈ-కేవైసీ పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది.

గడువులోగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలి



రేషన్ లబ్ధిదారుల ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం ఈ-కేవైసీ నమోదుకు ఫిబ్రవరి 28 వరకు గడువు పొడిగించింది. ఈ అవకాశాన్ని అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి. రేషన్‌కార్డులో పేరున్న ప్రతి లబ్ధిదారుడు ఖచ్చితంగా కేవైసీ నమోదు చేసుకోవాలి.

– జితేందర్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి





అసెంబ్లీలో ఎమ్మెల్యేలు

సిరిసిల్ల: అసెంబ్లీ సమావేశాలకు గురువారం మన జిల్లాకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అసెంబ్లీ సమావేశాలకు సహచర ఎమ్మెల్యేలతో కలిసి వచ్చారు.

డీఈఎస్‌ఐలో మెరిసిన జిల్లా విద్యార్థులు

- అభినందనలు తెలిపిన డీఈవో రమేశ్‌కుమార్



మహిళా వంట మిత్ర ప్రదర్శనతో విద్యార్థులు

సిరిసిల్లక్రైం: విద్యార్థి దశ నుంచి ఆవిష్కరణలకు ఆజ్యం పోసిన విద్యార్థుల్లో డిస్కవర్ అండ్ ఎంపవర్ స్టూడెంట్ ఇన్నోవేటర్స్ ప్రోగ్రాం(డీఈఎస్‌ఐ) టాప్ 15 ప్రదర్శనలను హైదరాబాద్ హైటెక్‌సిటీలోని బోచ్ కంపెనీ ఆఫీస్‌లో ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో జిల్లాకు చెందిన ఐదుగురు విద్యార్థులు పాల్గొన్నారు. ఇంక్విలాబ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గంభీరావుపేట మండలం దమ్మన్నపేట హైస్కూల్ విద్యార్థులు తయారు చేసిన మహిళా వంట మిత్రకు నాల్గో స్థానం లభించింది. విద్యార్థులు శ్రీచైత్ర, సుప్రియ, వినీల, నితిన్, రాకేశ్ బహుమతులు అందుకున్నారు. గైడ్‌టీచర్‌గా సంపత్ వ్యవహరించారు. విద్యార్థులను డీఈవో రమేశ్‌కుమార్, జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య, ప్రధానోపాధ్యాయులు చింతపల్లి వెంకటేశ్వర్‌రావు, ఉపాధ్యాయ బృందం బోయన్నగారి నారాయణ, మార్కెపల్లి రాజు, దాసరి శ్రీధర్, గోల్కొండ శ్రీధర్, పాశం భాస్కర్ అభినందించారు.

సమస్య ఎదురైతే షీటీంను సంప్రదించండి

- షీటీం ఏఎస్సై ప్రమీల



మాట్లాడుతున్న ఏఎస్సై ప్రమీల

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): విద్యార్థినులు, యువతులు పోకిరీలు, ఇతరత్ర వేధింపులు ఎదుర్కొంటే వెంటనే షీటీంను సంప్రదించాలని షీటీం ఏఎస్సై ప్రమీల తెలిపారు. మండలంలోని రాచర్లగొల్లపల్లి హైస్కూల్‌లో గురువారం పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఏఎస్సై ప్రమీల మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్న వెంటనే షీటీమ్‌ను 87126 56425లో సంప్రదించాలని సూచించారు. హెచ్‌ఎం మురళీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యవసాయ విజ్ఞానయాత్రలో రైతులు



పంటలు పరిశీలిస్తున్న డైరెక్టర్లు, రైతులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో గురువారం రైతులు, డైరెక్టర్లు వ్యవసాయ విజ్ఞానయాత్ర చేపట్టారు. పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా అంకాపూర్‌లో పంటల సాగును పరిశీలించారు. గ్రామస్తులు అవలంబిస్తున్న పంటల సాగు విధానం, అక్కడి పంటల గురించి తెలుసుకున్నారు. జంగిటి సత్తయ్య, ల్యాగల సతీశ్, నేవూరి వెంకటనరసింహారెడ్డి, కనకట్ల సుధాకర్, గంద్ర ప్రభాకర్‌రావు, గోగూరి ప్రభాకర్‌రెడ్డి, సెక్రటరీ కిశోర్‌కుమార్ తదితరులు వెళ్లారు.

ఆలయం వద్ద బోరుబావి



ఆలయం వద్ద భక్తులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రం శివారులోని శ్రీలక్ష్మీకేశవపెరుమాండ్లు–ఆంజనేయస్వామి ఆలయం వద్ద గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బోరు వేశారు. భక్తుల అవసరాలు తీర్చేందుకు ఈ బోరువేయించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ పా రిపెల్లి రాంరెడ్డి, వైస్‌చైర్మన్ ముత్యాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పందిర్ల లింగంగౌడ్, దొమ్మాటి నర్సయ్య, సద్ది లక్ష్మారెడ్డి, చెన్ని బాబు, రాంరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎస్‌కే గౌస్, గుండాడి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్టార్టర్లను దహనం చేసిన దుండగులు



ధర్మారంలో కాలబెట్టిన స్టార్టర్లు

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని ధర్మారంలో పొలం వద్ద ఉన్న స్టార్టర్లను గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారు. ధర్మారం గ్రామానికి చెంది న గంగుల మహేశ్ ఉపాధినిమిత్తం గల్ఫ్‌కు వెళ్లాడు. మహేశ్ పొలం వద్ద ఉన్న రెండు స్టార్టర్లను దుండగులు కాలబెట్టారు. గురువారం ఉదయం పొలం వ ద్దకు వెళ్లిన మహేశ్ భార్య భవాని కాలబెట్టిన స్టార్టర్లను చూసి కోనరావుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్ల: తంగళ్లపల్లి మండలం మండెపల్లి డ్రైవింగ్ శిక్షణ, పరిశోధన కేంద్రంలో అర్హులైన అభ్యర్థులకు డ్రైవింగ్ శిక్షణ ఇస్తున్నారు. ఈజీఎంఎం సపోర్టులో భాగంగా ఈనెల 16 నుంచి కొత్త బ్యాచ్‌కు శిక్షణ ప్రారంభమవుతుందని నిర్వాహకులు గురువారం తెలిపారు. 20 నుంచి 28 ఏళ్ల మధ్య వయసు గల గ్రామీణ ప్రాంతాల అభ్యర్థులకు శిక్షణ ఇస్తారు. కనీసం పదోతరగతి చదువుకుని, 160 సెంటిమీటర్ల ఎత్తు ఉండాలన్నారు. దేశంలో ఎక్కడైనా డ్రైవింగ్ ఉద్యోగం చేసేందుకు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. ఆధార్, కులం, ఆదాయం సర్టిఫికెట్లు, బ్యాంకు ఖాతా, 6 ఫొటోలతో శిక్షణకు రావాలని సూచించారు. ఏ విధమైన లైసెన్స్ లేని వారికి లైట్‌మోటారు వెహికిల్ శిక్షణ ఇస్తామని, వివరాలకు 89854 31720 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఇండో- నేపాల్ కరాటే పోటీల్లో పతకాలు



కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో జరిగిన ఇండో–నేపాల్ కరాటే చాంపియన్‌షిప్‌పోటీల్లో కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు పతకాలు సాధించినట్లు పాఠశాల పీఈటీ సిలివేరి మహేందర్ తెలిపారు. కటాస్ విభాగంలో పోటీపడిన ఆహిల్ బంగారు పతకం, షాస్మిన్ రజతం సాధించినట్లు పేర్కొన్నారు. గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పతకాలు సాధించిన విద్యార్థులను మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి, డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, ప్రిన్సిపాల్ సరితారెడ్డి, పీఈటీలు మహేందర్, జహేదా అభినందించారు.

గొడ్డలితో దాడి.. ఇరువురిపై కేసు

వేములవాడ: పాతకక్షల నేపథ్యంలో గొడ్డలితో దాడి చేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్ గురువారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం ఐతుపెల్లికి చెందిన పలుమారి వంశీ కుటుంబానికి అదే గ్రామానికి చెందిన చీమల శశి, చీమల వేణు, చీమల శ్రీనివాస్, చీమల సాయి, చీమల వినయ్‌లతో కొంతకాలంగా గొడవలు ఉన్నాయి. ఈనెల 7వ తేదీ రాత్రి వంశీ తన అన్న వేణు, బావ వినయ్‌లతో కలిసి వేములవాడకు వచ్చారు. వేణు, వినయ్‌లపై శశి, చీమల వేణు గొడ్డలితో దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వంశీ ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వేములవాడ: వేములవాడ బైపాస్‌రోడ్డులో మూడు రోజుల క్రితం బైక్ ఢీకొని ఇద్దరు మరణించిన సంఘటనలో మరొక వ్యక్తి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నాడు. చికిత్స పొందుతున్న మూడో వ్యక్తి గురువారం మృతిచెందినట్లు వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. దీంతో అతివేగానికి ముగ్గురు బలైనట్లు చెప్పారు.

ఆలస్యంగా తెలంగాణ ఎక్స్‌ప్రెస్



తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలు

రామగుండం: హైదరాబాద్ నుంచి న్యూఢిల్లీ వెళ్లు రైలు నం.12723 తెలంగాణ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రామగుండంకు ఉదయం 9.30 గంటలకు రావాల్సి ఉండగా (11.30 గంటలు ఆలస్యం) రాత్రి 9 గంటలకు రానుంది. న్యూఢిల్లీ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లు రైలు నం.12724 తెలంగాణ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు రామగుండంకు మధ్యాహ్నం 12.30 గంటలకు రావాల్సి ఉండగా (14 గంటల ఆలస్యం) శుక్రవారం వేకువజామున రానున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కాగా గంటల తరబడి ఆలస్యంగా నడుస్తుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు.

కొండగట్టు అంజన్న హుండీ ఆదాయం రూ.83లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

కొండగట్టు(చొప్పదండి): జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీఆంజనేయస్వామివారికి భక్తుల ద్వారా వచ్చిన హుండీల ఆదాయాన్ని గురువారం ఆలయ ఈవో వెంకటేశ్ సమక్షంలో లెక్కించారు. ఇటీవల వరుస దొంగతనాలు చోటుచేసుకోవడంతో కట్టుదిట్టమైన పోలీసు భద్రత మధ్య లెక్కింపు ప్రక్రియ చేపట్టారు. 28రోజులకు రూ.83,91,502 నగదు, 32 గ్రాముల బంగారం, 4.5కిలోగ్రాముల మిశ్రమ వెండి, 13 విదేశీ కరెన్సీ వచ్చినట్లు ఆలయ వర్గాలు తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్ ఏసీ చంద్రశేఖర్, ఎస్సై అశోక్, ఏఈవో అంజయ్య, ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాసశర్మ సునీల్, ధర్మేందర్, శ్రీరాజరాజేశ్వర సేవా సమితి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

యువకుని ఆత్మహత్యాయత్నం

- ఆస్పత్రికి తరలింపు



చికిత్స పొందుతున్న సాయికుమార్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన బోడ సాయికుమార్(28) కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్థాపానికి గురై గడ్డి మందుతాగి బుధవారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు. సాయికుమార్ ఎలాంటి పనులు చేయకుండా జులాయిగా తిరుగుతుండడంతో కుటుంబ సభ్యులు పనులు చేసుకోవాలని మందలించారు. సాయికుమార్ సోదరుడు శ్రీను ఫైనాన్స్‌లో కారు తీసుకొని అద్దెకు నడుపుతున్నాడు. ఖాళీగా ఉంటున్న సాయికుమార్‌ను కారు నడుపుకోవాలని, వచ్చిన డబ్బులతో ఫైనాన్స్ కిస్తీలు చెల్లించుకోవాలని సూచించాడు. కారు కిస్తీలు చెల్లించకుండా మద్యానికి బానిసై జులాయిగా తిరుగుతుండడంతో సోదరుడు, తల్లిదండ్రులు మందలించారు. దీంతో సాయకుమార్ బుధవారం గడ్డిమందు తాగాడు. కుటుంబ సభ్యులు స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సాయికుమార్ ఆత్మహత్యాయత్నంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై రమాకాంత్ తెలిపారు.

మట్టి స్టాక్ పరిశీలన

బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లి నుంచి వేములవాడ వెళ్లే దారిలో మార్కెట్‌యార్డు పరిసరాల్లో నిల్వ ఉంచిన మట్టి నిల్వలను గురువారం జిల్లా మైనింగ్ అధికారి రఘుబాబు పరిశీలించారు. లారీల్లో మట్టిని తరలిస్తున్నట్లు ఫిర్యాదు రావడంతో క్షేత్రస్థాయిలో మట్టిస్టాక్ పరిశీలించినట్లు పేర్కొన్నారు. రవాణా చేస్తున్న వాహనాలను నిలుపుదల చేశామన్నారు. తహసీల్దార్ ఆధ్వర్యంలో శుక్రవారం విచారణ చేపడతామన్నారు. మట్టి స్టాక్ ఎవరు చేశారు తదితర విషయాలు తదుపరి విచారణలో తెలుసుకుంటామని చెప్పారు.

గ్రాండ్ ఫినాలేకు పారమిత విద్యార్థిని



శుభశ్రీ సాహును అభినందిస్తున్న ప్రసాదరావు

కొత్తపల్లి(కరీంనగర్): పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న శుభశ్రీ సాహు తన శాస్త్రీయ ఆవిష్కరణలకు గాను వివో ఇగ్నైట్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ గ్రాండ్ ఫినాలేకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రితేష్ మెహెతా తెలిపారు. దేశవ్యాప్తంగా 20వేల మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనగా మూడోదశ కింద ఎంపికైన 25 ఉత్తమ ఆలోచనల నుంచి 10 ఎంపిక చేయగా అందులో విద్యార్థిని ఎంపికవ్వడం గర్వంగా ఉందన్నారు. న్యూఢిల్లీలోని వసంత్‌కుంజ్‌లో ఈ నెల 10వ తేదీన జరగబోయే వివో ఇగ్నైట్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ అవార్డ్స్–2023 గ్రాండ్ ఫినాలేలో శుభశ్రీ పాల్గొంటున్నట్లు చెప్పారు. శుభశ్రీ తన గైడ్ టీచర్ లలిత్ మోహన్ సాహు ఆధ్వర్యంలో పర్యావరణ అనుకూలమైన, మల్టీఫంక్షనల్, తక్కువ ధర, పోర్టబుల్ వ్యవసాయ యంత్రాన్ని అభివృద్ధి చేయడం ద్వారా రైతుల సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేసిందన్నారు. ఈ యంత్రం నూర్పిడి, ధాన్యాన్ని వేరు చేయడం, గడ్డిని కత్తిరించడం, వినోవింగ్, బ్యాగ్ కుట్టడం వంటి నాలుగు వేర్వేరు కార్యకలాపాలతో సమర్థవంతంగా పని చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో గురువారం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శుభశ్రీను పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా.ఇ.ప్రసాదరావు అభినందించారు. డైరెక్టర్లు ప్రసూన, అనుకర్ రావు, రాకేశ్, వి.యు.యం.ప్రసాద్, వినోద్ రావు, హన్మంతరావు, ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ పాల్గొన్నారు.

పూలే విగ్రహం ఏర్పాటుపై స్పష్టతనివ్వాలి

- యునైటెడ్ పూలే ఫోరం రాష్ట్ర నాయకుడు గుంజపడుగు హరిప్రసాద్



మాట్లాడుతున్న హరిప్రసాద్

కరీంనగర్: అసెంబ్లీలో మహాత్మాజ్యోతిబాపూలే విగ్రహం ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతనివ్వాలని యునైటెడ్ పూలే ఫోరం రాష్ట్ర నాయకుడు గుంజపడుగు హరిప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లాకేంద్రంలోని ఓ హోటల్‌లో మాట్లాడుతూ కరీంనగర్‌లో బీసీల హక్కుల సాధనకు ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొని తమ సూచనలు, సలహాలు ఇచ్చి భవిష్యత్ కార్యాచరణపై తమ ఆలోచనను పంచుకున్న వారికి ధన్యవాదాలు తెలిపారు. 119 నియోజకవర్గాల్లో మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయడం జరిగిందని, పూలే పేరు మీద దాదాపు 366 పాఠశాలలు నడుస్తున్నాయన్నారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా పార్లమెంటులో మహాత్మా జ్యోతిబా పూలేకు భారతరత్న ఇవ్వాలని ప్రశ్నించిన మొదటి వ్యక్తి మాజీ ఎంపీ వినోద్‌కుమార్ అని గుర్తు చేశారు. ఏప్రిల్ 11న మహాత్మా జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా అప్పటి వరకు అసెంబ్లీలో విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో గ్రామస్థాయి నుంచి ఉద్యమం చేసేలా యునైటెడ్ పూలే ఫోరం కార్యాచరణ ఉంటుందని స్పష్టం చేశారు. యునైటెడ్ పూలే ఫోరం జిల్లా కన్వీనర్ వరాల శ్రీనివాస్, వివిధ సంఘాల నాయకులు కలర్ సత్యనారాయణ, రాజేశ్వరి, కనుకయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల వివరాలు నమోదు చేయాలి



చొప్పదండి: ఎరువుల కొనుగోలు, అమ్మకాల వివరాలు ఎప్పటికప్పుడు రిజిష్టర్‌లలో నమోదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి ప్రియదర్శిని సూచించారు. మండలంలోని పలు ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ దుకాణాలను, గోదాములను ఆమె గురువారం తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. యాప్ ద్వారా రికార్డుల నమోదును కూడా పరిశీలించారు. ఆమె వెంట మండల వ్యవసాయాధికారి వంశీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.